# మండుతున్న ఎండలు

- ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభం
- మధ్యాహ్నం 12గంటల నుంచి 40నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనం





భీమవరంలో ఎండ దెబ్బకు ఖాళీగా ఉన్న రోడ్లు

**భీమవరం(ప్రకాశం చౌక్):** గత ఐదు రోజుల నుంచి పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రోహిణి కార్తె తన ప్రభావాన్ని చూపిస్తోంది. శుక్రవారం భానుడు భగభగమంటూ నిప్పులు కురిపించాడు. భీమవరం పట్టణంలో ఎండ వేడిమికి ప్రజలు విలవిలలాడిపోయారు. గడచిన నాలుగు రోజుల నుంచి నెత్తిపై నిప్పుల కుంపటి అన్నట్లుగా వాతావరణం ఉంది. నిప్పుల కొలిమితో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారు అనేక అవస్థలు పడ్డారు. సూర్యతాపానికి ఇళ్లల్లో నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. గత నాలుగు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో ఎండ చుర్రుమంటోంది. శుక్రవారం పరిస్థితి మరీ దారుణంగా మారింది. జాతీయ రహదారితో పాటు పట్టణంలోని ప్రధాన రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారాయి. సూర్యభగవానుని ఉగ్ర రూపానికి ఎవరూ ప్రయాణాలు చేయలేక రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పది దాటితే ఎవరూ బయట తిరిగే సాహసం చేయలేకపోతున్నారు. రాత్రి వేళల్లో సైతం ఉక్కబోత కారణంగా ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో రోడ్లపై రాకపోకలు సాగించేవారు తలకు తడిగుడ్డలు చుట్టుకుని ప్రయాణించడం... ప్రతి ఫర్లాంగు దూరానికి గుక్కెడు మంచినీళ్లు తాగి ఉపశమనం పొందుతున్నారు.

**ఈ జాగ్రత్తలు తీసుకొంటే మేలు**

- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగును తీసుకెళ్లాలి.
- పలుచని తెలుపు, నలుపు,ఎరుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ పెట్టుకోవాలి లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరుబయట అధిక శ్రమతో కూడిన పనులు చేయరాదు.
- మజ్జిగ, నిమ్మరసం, మంచినీరుతో పాటు, ఓఆర్ఎస్ ద్రావణం, శీతల పానీయాలు వెంట తీసుకెళ్లాలి.
- ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

**వడ దెబ్బ తగిలితే ప్రథమ చికిత్స ఇలా:**

ఎవరైన వడ దెబ్బకు గురైతే కళ్లు తిరిగిపడిపోవడం , శరీరం చేమటలు పట్టడం, సృహలో లేకపోవడం జరుగుతుంది. అలాంటి వ్యక్తిని ముందుగా నీడకు చేర్చి చల్లనీ నీళ్లతో శరీరాన్ని తుడవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, కాని ఓఆర్ఎస్ ద్రవాణాన్ని తాగించాలి. నిర్లక్ష్యంగా చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యులకు చూపించాలి.

## క్లుప్తంగా

### ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

**భీమవరం:** జానపద, పౌరాణిక, సాంఘిక, కుటుంబ కథానాయకుడుగా పలు పాత్రలలో నటించి, జీవించి, తన హావ భావాలతో, సినీ రంగంలో డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా అభిమానుల హృదయాల్లో నిలిచి పోయిన సూపర్‌స్టార్ కృష్ణ సదా స్మరణీయులని పలువురు వక్తలు కొనియాడారు. సినీ ప్రముఖుడు సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతి సందర్భంగా భీమవరంలో శుక్రవారం అన్నదానం చేశారు. ముందుగా స్థానిక హెడ్వర్ట్ ట్యాంకు వద్ద కృష్ణ కాంస్య విగ్రహానికి కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయప్రోలు శ్రీనివాసమూర్తి, రాయప్రోలు భగవాన్, బిహెచ్.సుబ్బరాజు, జి.ప్రసాద్, ఎస్.లక్ష్మీ నారాయణ, ఎండి.హుసేన్, మోహనరావు, రాంబాబు, రాకేష్‌రాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ప్రసన్న, మానపురం సత్యనారాయణ, పంతం పద్మనాభం పాల్గొన్నారు.

### నేటి నుంచి హనుమద్ జయంతి ఉత్సవాలు

**పాలకోడేరు:** మండలంలోని పెన్నాడ అగ్రహారం గ్రామంలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో శనివారం నుంచి జూన్ 3 వరకు హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ ఉత్సవాలలో భాగంగా జూన్ 1 ఉదయం 4 గంటలకు పంచ అమృతాలతో అభిషేకం, సాయంత్రం 6 గంటలకు సహస్రనామ సింధు అర్చన, 7 గంటలకు శ్రీవిజయ గణపతి భక్త సమాజం వారిచే భజన కార్యక్రమం ఉంటుందని, జూన్ 2 ఉదయం 4 గంటలకు పండ్ల రసాలతో అభిషేకం, సాయంత్రం 6 గంటలకు అరటి పండ్లతో సహస్రనామం పూజ, సాయంత్రం 7 గంటలకు సింహాద్రి అప్పన్న కోదండ రామ భజన, భీమవరం వారిచే భజన కార్యక్రమం, జూన్ 3 ఉదయం 4 గంటలకు తేనెతో అభిషేకం ఉదయం 6 గంటలకు లక్షపత్రి పూజ,మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన నిర్వహిస్తారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

### కేపీపాలెం నార్త్‌లో పంట బోదెల తవ్వకాలు



పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

**మొగల్తూరు:** తీర ప్రాంత గ్రామాలైన కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంట బోదె తవ్వకాలు చురుగ్గా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో చెరువులను పూర్తి స్థాయిలో నింపారు. కొబ్బరి, సరుగుడు, మామిడి తోటలకు పూర్తి స్థాయిలో నీరు అందేలా పంట బోదెల తవ్వకాలు చేపట్టారు. శుక్రవారం కేపీపాలెం సౌత్ గ్రామంలోని ప్రధాన పంటబోదెలో గుర్రపు డెక్క, మట్టి మేటలు వేయడంతో వాటిని తొలగించేందుకు పంట బోదె తవ్వకాలు చేపట్టారు. అధికారుల ఆదేశాల మేరకు నీరు వృథా కాకుండా తోటలకు నీరందేలా పంట బోదెలు తవ్వకాలు చేపట్టామని టీఏ వెంకటేశ్వరరావు తెలిపారు.

### అక్రమంగా మట్టి రవాణా

**పాలకొల్లు అర్బన్:** చింతపర్రులో ఏ విధమైన అనుమతులు లేకుండా రెండు అనధికార లే అవుట్లను మట్టితో పూడుస్తున్నారు. దీనికి వడ్లవానిపాలెం నుంచి చింతపర్రులోని అనధికార లే అవుట్‌లోకి భారీ లోడు లారీలతో యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా లారీలతో మట్టి రవాణా చేయడంతో పంచాయతీ రోడ్లు పాడైపోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి రవాణాకు జిల్లా మైనింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖ అధికారులు పూర్తి సహకరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దార్, వీఆర్వోలకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు తెలిపారు. తక్షణం అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవాలని సర్పంచ్ పెద్దిరాజు కోరుతున్నారు.

### దోమ పుట్టుకను నివారించాలి

**తణుకు అర్బన్:** దోమ పుట్టుకను నిరోధిస్తే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని వెక్టార్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు ఇరగవరం రోడ్డులో శుక్రవారం నిర్వహించిన డ్రైడే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రజలంతా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు డ్రెయిన్‌లలో వ్యర్థాలను పారవేయకుండా చూసుకోవాలని సూచించారు. దోమ పెట్టే లార్వా 8 నుంచి 10 రోజుల్లోపు దోమగా మారుతుందని, అందువలన వారానికోసారి ఇంటి పరిసరాల్లో అవసరంలేని నీటి నిల్వలతోపాటు ఇంటి ఆవరణల్లోని రుబ్బురోళ్లు, కూలర్‌లు, రిఫ్రిజిరేటర్‌ను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. దోమల ఆవాసాలుగా ఉండే ప్రాంతాలను శుభ్రం చేస్తే దోమ పుట్టుకను నివారించుకోవచ్చని చెప్పారు.

# ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న దృశ్యం

**భీమవరం:** భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ అన్నారు. కళాశాలలో నెలరోజుల పాటు సబ్ జూనియర్ స్థాయిలో విద్యార్థులకు షటిల్ బ్యాడ్మింటన్, చెస్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో వేసవి కాలంలో విద్యార్థులకు క్రీడల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రత్యేకంగా కోచ్‌లను ఏర్పాటు చేసి శిక్షణ అందించడం వలన విద్యార్థులు భవిష్యత్తులో క్రీడాకారులుగా రాణిస్తారన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ సబ్ జూనియర్ స్థాయిలో విద్యార్థులు నెల రోజులు క్రమం తప్పకుండా శిక్షణకు హాజరుకావడం క్రీడల పట్ల వారికున్న ఆసక్తికి నిదర్శనమన్నారు. అనంతరం శిక్షణ పొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ కిరణ్‌కుమార్‌వర్మ, చెస్ కోచ్‌లు ఐ.ఉమామహేశ్వరి, ఎస్ఎస్ చంద్రశేఖర్‌లను మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇంచార్జ్ పి.భువనేశ్వరి, ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్ పి.భవాని, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్.హరిమోహన్, జి.సారిక పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



సలహా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న భాను నాయక్

**భీమవరం (ప్రకాశంచౌక్):** లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని సబ్ డిస్ట్రిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రో ప్రియట్ అథారిటీ అధికారి డాక్టర్ భాను నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో పీసీపీ, ఎన్‌డీటీ జిల్లా సలహా కమిటీ సమావేశం డాక్టర్ కె.భాను నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భంలో బిడ్డ ఆరోగ్యం పరిశీలనకు మాత్రమే స్కానింగ్ చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ గడువు పూర్తయిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ చేసిన వారు, ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు శిక్షార్హులు అని తెలిపారు. అటువంటి వారికి చట్ట ప్రకారం రూ.10 వేలు జరిమానా, మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రెండో తప్పుకు ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సభ్యులు డీపీఆర్వో టి.నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ డీపీఎంవో డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి, ఏవో డాక్టర్ సీహెచ్ భావన, సిబ్బంది పి.అనంతలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగికి నైపుణ్యంతోనే గుర్తింపు



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

**భీమవరం (ప్రకాశంచౌక్):** ఉద్యోగిలో నైపుణ్యం ఉంటే తగిన గుర్తింపు లభిస్తుందని, సీనియర్ ఉద్యోగుల నుంచి ప్రతి విషయాన్ని అవగతం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు ఏర్పాటు చేసిన కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ తోట లీలా శంకర్ సత్య వరప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో టైపిస్టుగా చేరి 37 సంవత్సరాలుగా వివిధ హోదాలలో పనిచేసి తహసీల్దారు హోదాలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా నేడు పదవీ విరమణ పొందిన తోట లీలా శంకర్ సత్య వరప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, కలెక్టరేట్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగికి నైపుణ్యత ఉంటేనే గుర్తింపు వస్తుందని, సీనియర్ ఉద్యోగుల నుంచి మెళకువలు నేర్చుకోవాలన్నారు. అప్పుడే ప్రజలకు మంచి సేవలను అందజేయడానికి ఉద్యోగికి అవకాశం వస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ జూనియర్ ఉద్యోగులు సీనియర్స్‌ను రోల్ మోడల్‌గా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, కలెక్టరేట్ ఏవో పి.పాపారావు, సీహెచ్ దుర్గాప్రసాద్, సీహెచ్ రవికుమార్, ఎం.సన్యాసిరావు, కలెక్టరేట్, భీమవరం ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పొగాకుతో ఆరోగ్యానికి హానికరం



ఉండిలో పొగాకుకు వ్యతిరేకంగా ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది



కాళ్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు



ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

**ఉండి:** పొగాకు సేవించడం వల్ల ఆరోగ్యానికి అన్ని విధాలా అనర్థమేనని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ బి.సాయిచంద్ర, డాక్టర్ బెన్నీ సామ్యూల్, డాక్టర్ సునంద తెలిపారు. శుక్రవారం ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు పీహెచ్‌సీల వద్ద పొగాకుకు వ్యతిరేకంగా ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వలన నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, ప్రేగు, జీర్ణకోశ క్యాన్సర్‌లు వంటి భయంకర రోగాలతో ప్రాణహాని తప్పదన్నారు. అలాగే పక్షవాతం, అంధత్వం, చిగురువాపు, ఆయాసం, గుండె వ్యాధులు, రక్తనాళాలు గట్టిపడటం వంటి అనేక వ్యాధులు వస్తాయని తెలిపారు. ముఖ్యంగా సంతానోత్పత్తి తగ్గిపోయి, ఎముకలు బలహీన పడతాయన్నారు. భావి తరాలకు బాసటగా నిలవాల్సిన యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, అవి వాడితే తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు. పొగతాగే వారి కంటే పీల్చే వారి ఆరోగ్యం ఎక్కువగా దెబ్బతింటుందన్నారు. కాబట్టి మన కుటుంబ సభ్యులు, పిల్లల ఆరోగ్యం కాపాడేందుకు తప్పనిసరిగా పొగాకుకు దూరంగా ఉండాలని డాక్టర్లు సూచించారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

**పొగాకు వల్ల ప్రాణహాని..**

**కాళ్ల:** పొగాకు వల్ల ప్రాణహాని సంభవించే ప్రమాదం ఉందని ప్రభుత్వ వైద్యాధికారి సరాబు సునీల్ తెలియజేశారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా శుక్రవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పొగాకు మానవ శరీరంలోని ప్రతి అవయవాన్ని నాశనం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యులు సునీత సీహెచ్‌వో విజయావతి పాల్సన్ హెచ్.వీలు పరంజ్యోతి సుబ్బలక్ష్మి ఆశ వర్కర్లు ఏఎన్ఎంలు హెల్త్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

**పొగాకు క్యాన్సర్‌కు బాట**

**ఆకివీడు:** పొగాకు నమలడం, పొగ పీల్చడం ద్వారా క్యాన్సర్ బారిన పడి, ఇతర అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడవలసి వస్తుందని పీహెచ్‌సీ వైద్యులు ఎం. రాజశేఖర్ చెప్పారు. మండలంలోని పెదకావరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకుకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పొగాకుతో తయారు చేసే వస్తువుల్ని విస్మరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు బీ.రాజశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ జే.సత్యనారాయణ, పీ.మార్తమ్మ, సూపర్‌వైజర్‌లు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# నృత్యంతో సాంస్కృతిక నైపుణ్యం



స్థానిక ఐఎంఏ హాల్‌లో నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు



వేసవి శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: చిన్నారుల్లో సాంస్కృతిక నైపుణ్యం పెంపొందించేందుకు, క్రమశిక్షణ, మానసికోల్లాసాన్ని నృత్య ప్రదర్శనలు దోహదపడతాయని స్థానిక ఆమని నృత్య కళా నిలయం నిర్వాహకులు చాగంటిపాటి మౌనిక రాజశేఖర్ అన్నారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా 30 రోజులుగా భరత నాట్యం, జానపద నృత్యాలపై 50 మందికి పైగా చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ముగింపు సమావేశంలో నిర్వాహకులు మౌనిక మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ఆశయం మేరకు నృత్య కళా నిలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళలు అంతరించిపోతున్న తరుణంలో తమ ముగ్గురు సోదరీమణులు కలిసి ఆకివీడు, ద్వారకా తిరుమల, హైదరాబాద్‌లలో నృత్య శిక్షణ కేంద్రాల్ని ఏర్పాటు చేశామన్నారు. చిన్నారుల్లో నాట్యం పట్ల ఆసక్తి, ఆదరించే వారు, ప్రోత్సహించే వారు ఉన్నప్పటికీ శిక్షణ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో నృత్య కళాకారులు తగ్గిపోతున్నాయని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారందరికీ సంస్థ తరపున సర్టిఫికెట్లు అందజేశారు.

## వైఎస్సార్ సీపీదే మళ్లీ విజయం

**యలమంచిలి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో రెండవసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుంపర్రు గ్రామ పంచాయతీ కడిమిపుంతలో బీసీ నాయకుడు తుంగా నాగేశ్వరరావు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్నత వర్గాలంతా కూటమికి మద్దతు పలికితే బడుగు, బలహీన, దళిత, మైనారిటీ వర్గాలు జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికారన్నారు. పెత్తందారుల చేతుల్లో ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వర్గాలు ఎన్ని కట్టుకథలు ప్రచారం చేసినా జూన్ 4న వచ్చే ఎన్నికల ఫలితాల్లో ఫ్యాన్ గాలి బలంగా వీస్తుందని వెంకటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు.

## ఘనంగా హనుమద్ జయంతి ఉత్సవాలు



స్థానిక ఆనాల చెరువు గట్టు వద్ద భక్తాంజనేయ స్వామి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

**ఆకివీడు:** హనుమత్ జయంతి సందర్భంగా పలు గ్రామాల్లో, పట్టణంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల వద్ద జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వర పూజలు, లక్ష్మీగణపతి హోమం, మన్యు పాశుపత హోమం కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం హనుమ జయంతి సందర్భంగా సామూహిక సహస్ర నాగ వల్లీ దళార్చన, సింధూర అర్చన, సువర్చలా సమేత హనుమత్ కల్యాణ మహోత్సవం జరుగుతుంది. అనంతరం అన్న సమారాధన ఏర్పాట్లు చేశారు. స్థానిక ఆనాల చెరువు, పెద్దింటి అమ్మవారి ఆలయంలో, మాదివాడ, చినమిల్లిపాడు, కాళింగగూడెం, రాజులపేట, కుప్పనపూడిలోని ఊర చెరువు, పంచాయతీ కార్యాలయం, వెలంపేట, బైపాస్‌రోడ్డు, ఉప్పుటేరు బ్రిడ్జి, అయిభీమవరం రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయాలలో హనుమత్ జయంతి ఉత్సవాల్ని వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు.

# సినీ నిర్మాత తుమ్మలపల్లికి సత్కారం



కాఫీక్లబ్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లిని సత్కరిస్తున్న దృశ్యం

**భీమవరం:** స్వశక్తితో సినీ నిర్మాణ రంగంలో తుమ్మలపల్లి రామసత్యనారాయణ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. అలాగే 116 చిత్రాలను నిర్మించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు కావడం విశేషమని కొనియాడారు. భీమవరంలో శుక్రవారం తుమ్మలపల్లిని మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. భీమవరం పట్టణానికి చెందిన తుమ్మలపల్లి అవలీలగా సినిమాలు నిర్మించడం ఆయనకే సాధ్యమని, వర్ధమాన కళాకారులకు ఆయన ఒక ఆశాకిరణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓలేటి శ్రీనివాస గుప్తా, జూలూరి రాజా, కనగర్ల రామకృష్ణ, బొండాడ బంగారురాజు, చవ్వ భామకృష్ణమూర్తి, కురిశెట్టి శ్రీనివాస అప్పారావు, కొల్లేపర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్‌మేన్‌కు ఘన సత్కారం

**పాలకొల్లు అర్బన్:** పాలకొల్లు ఫైర్ స్టేషన్‌లో సీనియర్ లీడింగ్ ఫైర్‌మేన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన కాంపాటి సత్యనారాయణ, భగవతి దంపతులను శుక్రవారం సత్కరించారు. రీజనల్ ఫైర్ ఆఫీసర్ (రాజమండ్రి) వి.స్వామి చేతుల మీదుగా శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. జిల్లా ఫైర్ ఆఫీసర్లు జానకిరామ్, పి శ్రీనివాసరావు, కె శ్రీనివాసరావు సత్యనారాయణ సేవలను అభినందించారు.

## చిన్నారులకు పండ్లు, మిఠాయిల పంపిణీ

**పాలకొల్లు అర్బన్:** సూపర్‌స్టార్ కృష్ణ పుట్టిన రోజు వేడుకలను అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో శుక్రవారం ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణ, మహేష్‌బాబు యువసేన ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు మేడికొండ శ్రీనివాస్ చౌదరి కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

## పచ్చి రొట్ట పెంపకంతో నేల సారవంతం

**మొగల్తూరు:** పచ్చి రొట్ట పెంపకం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధి కారి అబ్దుల్ రహీమ్ శుక్రవారం తెలిపారు.మినుము, పిల్లిపెసర, జీలుగ పెంపకం ద్వారా నేలకు మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయన్నారు. పైరుకు రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికడతాయన్నారు. పచ్చి రొట్ల వల్ల వరికి పూర్తి స్థాయిలో నత్రజని అందుతుందన్నారు. పచ్చి రొట్ల పైర్లను పూత దశలో నేలలో కలిపి దున్నడం వల్ల మొక్కలకు నత్రజని, పొటాష్ అందుతుందన్నారు.ఎకరాకు జనుము 16 కేజీలు, జీలుగ 24 కేజీలు వాడితే మంచి పోషకాలు అందుతాయన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న దృశ్యం

**పెనుగొండ:** మండుటెండలతో అవస్థలు పడుతున్న ఉపాధి కూలీలకు జడ్జి బీరా శ్రీనివాస్ అండగా నిలిచారు. పెనుగొండ మండలం ములపర్రులో సుమారు 270 మంది ఉపాధి కూలీలు చెరువు పనులు చేస్తున్నారు. వీరికి ములపర్ర గ్రామం సీతారాముని చెరువుకు చెందిన న్యాయమూర్తి బీరా శ్రీనివాస్ సహకారంతో శుక్రవారం మంచినీరు, మజ్జిగ, శీతల పానీయాలు అందించారు. ఉపాధి కూలీలకు అండగా నిలిచిన న్యాయమూర్తి శ్రీనివాస్‌కు ఉపాధి కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.